

# అనగనగా ఓ మంచి కథ

# ఎర్రరాళ్ళ నెక్లెసు

## కొమ్మూరి ఉషారాణి

### (1962 యువ మాసపత్రిక, దీపావళి సంచిక నుంచి)

'బజారు వీధి' అంటారు దాన్ని. రెండు పక్కలా ఎత్తయిన బంగళాలు, బట్టలు, నగలకొట్లతో యిరుగ్గా వుంది రోడ్డు. సూది మోపితే ఆననంత జనం, సైకిళ్ళు, బళ్ళు, కార్లు అన్నీ ఆ వీధిన వెళ్ళవలసిందే. మధ్య మధ్య మిఠాయి దుకాణాలు, కిళ్ళీకొట్లు. దుకాణాలకి సంబంధించిన వాళ్ళే చాలా మంది ఆ వీధిలో మకాం. తెల్లవారుతూనే నౌఖర్లచేత దుకాణం ముందు వూడ్పించి, అద్దాలు అవీ శుభ్రం చేయించటం ప్రారంభిస్తారు. సగం నిద్రలో, బద్దకంగా వాళ్ళు పనులు చేస్తుంటే, మేడమీంచి యజమానుల తనిఖీ, కేకలు పరిపాటి.

ఆ వీధి చాలా పొడుగు. అలా అలా నడవగా మరో మూడు రోడ్లు ఆ వీధిలో కలుస్తాయి. అక్కడ చాలా రద్దీగా వుంటుంది. ఆ మూడిట్లో ఒకటి సినిమా హాల్సుకీ మరోటి యూనివర్సిటీకీ దారులు. ఫ్యాక్టరీకి పనిలోకి పోయేవారు. సినిమాలకి పోయేవారు అంతా ఈ వీధమ్మట వెళుతుంటారు. ఉదయం 5 గం||కు ప్రారంభమయే రొద రాత్రి అయినా ఆగదు.

అయితే ఏం ! ఆ బజారు చాలా బాగుంటుంది. బట్టల దుకాణాల్లోంచి రంగురంగుల చీరలు వేళ్ళాడుతుంటాయి. అద్దాల బీరువాల్లోంచి రకరకాల నగలు మెరుస్తుంటాయి. వాటిని అంటుకుని వుండే చిన్నరకం కొట్లలో కొత్తరకం గాజులు, కుచ్చులు, చేతిసంచీలు, సవరాలు __ చూస్తున్నకొద్దీ యింకా చూడాలనిపిస్తుంటుంది. ఉదయమని లేదు, మధ్యాహ్నమని లేదు, సాయంత్రమని లేదు; ఆడవాళ్ళూ పిల్లలూ నిత్యం వీధిలో గుమికూడి ఉంటారు.

ఆ వీధికంతా పేరుబడ్డ కొట్టు సుబ్బారాయుడిది. అతని కొట్టుకి చాలా ధనవంతులు వస్తుంటారు. ఎంతో ఖరీదైన నగలకి ఆర్డర్లు యిస్తుంటారు. తాతముత్తాతలనాటినుంచీ ఈ వృత్తిలో ఆరితేరాడేమో, సుబ్బారాయుడు మంచి వ్యాపారం చేస్తుంటాడు.

అతనికి ఒక్కగానొక్క కొడుకు, పేరు సత్యం. వయసులో చిన్నవాడు. వ్యాపారరీత్యా అంత అనుభవం లేకపోయినా తన కులవృత్తిమీదా, తండ్రి తాతలు పోగుచేసిన ధనంమీదా అపారమైన భక్తి గౌరవాలు కలవాడు. జీవిత పరమావధి యినప్పెట్టె నింపటంలో లేకపోవచ్చు కానీ ఆ యినప్పెట్టెతో ఎన్నో ప్రయోజనాలున్నాయని అతని నమ్మకం. వేళ్ళకి రవ్వల ఉంగరాలు జిగేలుమన్నా, సిల్కు జుబ్బా వేసుకు కార్లో ప్రయాణం చేస్తున్నా, అతను గర్వపడుతుంటాడు. మనిషి ఎంత సాధువుగా వుండగలడో అంత విప్లవం కూడా లేవదీయ గలడు, మితభాషి.

★ ★ ★

"ఏయ్ ! ఆ అద్దం సరిగ్గా తుడవ్వేం. నిద్రమత్తు యింకా వదల్లా ?"

యజమాని అదలింపుకి రంగడు తలెత్తి చూశాడు. సత్యం పైన బాల్కనీలో నుంచుని వున్నాడు. ఉదయమే కొడుకు కంఠం, ఆ శ్రద్ధ విని సుబ్బారాయుడు సంబరపడ్డాడు.

"అబ్బాయ్ ! యిలారా."

సత్యం చొక్కా గుండీలు పెట్టుకుంటూ తండ్రి గదిలోకి వెళ్ళాడు.

"కాఫీ ఫలహారం తీసుకున్నావా ?... ఇంకా పొద్దెక్కలేదులే ! "

"నిన్నటి కాయితాలు చాలా వుండి పోయాయి. చూసుకోవాలి. వస్తా."

★ ★ ★

అద్దాలు తళ తళ మెరుస్తున్నాయి. ఎఱ్ఱ, నీలం ముఖమల్ పెట్టెలు, వాటిల్లో రకరకాల నగలు తళుక్కుమంటున్నాయి. సత్యం డ్రాయరు తలుపులు తీస్తూ కుర్చీలో కూర్చున్నాడు. కాయితాలు, బిల్లుల బొత్తి తీసి బల్లమీద సర్దాడు. దూరాన ఫ్యాక్టరీ మొదటి సైరన్ కూసింది. సత్యం ఆతృతగా వీధిలోకి చూస్తున్నాడు; కాస్త సేపయింది. సత్యం కళ్ళకి మసక మసగ్గా ఓ ఆకారం కనుపిస్తోంది. దగ్గిరగా వస్తోంది. కాళ్ళకి కడియాలు, వెడల్పాటి మందారరంగు నల్లగళ్ళచీర, పసుపుపచ్చ రవిక, నల్లని ముఖంలో రూపాయంత కుంకుమ, కుడిపక్కగా కొప్పు, అందులోంచి బాగా పైకి కనిపిస్తున్న చామంతిపువ్వు. బైటనుంచే అద్దంకి ముఖం ఆనించి లోపలికి చూస్తోంది. సన్నగా పొడుగ్గా వుంది. వయసు 20 కంటే వుండవేమో !

చాలా అమాయకమైన ముఖం. కోలగా కాటుక పెట్టినట్లున్న కళ్ళు. ఆ కళ్ళల్లో కోరికలు ముంచుకొస్తున్న లీలగా ఆశ. సన్నని చిన్న పెదిమలు. ఆ పెదిమలు కదిలించబోతే ఎడంబుగ్గ సొట్ట. కాలి బొటనవేలు మట్టిలో రాస్తూ నగలకేసి చూస్తున్న ఆమెకి మరో ప్రపంచం ఏమీ తెలియటం లేదు. అటూ ఇటూ పోతున్న జనం తప్పుకోమని హెచ్చరిస్తున్నారు. ఒక్కో నగా చూస్తున్న కొద్దీ ఆమెకి తనివి తీరటం లేదు. తల ఓ ప్రక్కగా వాల్చి, కళ్ళు తిప్పుకోకుండా అలా చూస్తూనే వుంది.

సత్యం కాయితాలు తిరగేస్తున్నాడు. మధ్య ఏదో రాసుకుంటున్నాడు. తల ఎత్తి చూస్తున్నాడు. కానీ అతని కళ్ళకెదురుగా చెదిరినట్లు కనుపించేవి – పచ్చంచు మందార రంగు చీర, చామంతి పువ్వు, దిగులుగా, అమాయకంగా చూస్తున్న అందమైన కళ్ళు – అతని మనసు పరవశంతో ఊగిపోతోంది. ఆనందం ఆకాశాన్నంటుకుంటోంది. అతను జేబురుమాలుతో ముఖం తుడుచుకున్నాడు. అటూ ఇటూ ఓ మారు బెరుగ్గా చూసి తలవంచుకున్నాడు. మళ్ళీ వెంటవెంటనే ఆలోచనలు ! ఆమెని ఒక మాటు లోపలికి పిలిస్తే? నగల్ని వేసుకోనిస్తే... పాపం ! ఎంత సంతోషిస్తుందో... బుగ్గన సొట్టపడేట్లు నవ్వుతుందా ? ఆ నవ్వు తను దగ్గిరగా చూడగలడా ? ఆకళ్ళల్లో దిగులు పోగొట్టగలడా ?...

దూరాన ఫ్యాక్టరీ సైరను మోగింది. రోడ్డు మీద జనం నడక వేగం హెచ్చించారు. ఆమె యిట్టే జనంలో మాయమయి పోయింది. ఉదయం వెళ్ళేప్పుడు ఆమె ఒక్కర్తే. కానీ సాయంత్రం కూడా యిద్దరు ముగ్గురు స్త్రీలు వుంటారు. అంతా ఆ వయసు వాళ్ళే. ఫ్యాక్టరీ కూలీలు బజారు వీధిలోకి రాగానే వాళ్ళ నడక వేగం తగ్గుతుంది. ముఖ్యంగా నగల దుకాణం ముందు. కాస్సేపటికి వాళ్ళు కదులుతారు, ఆమె తప్ప. ఆమె మాత్రం అద్దాల బీరువాలకేసి చూస్తూ అలాగే నిలబడుతుంది. సాయంకాలాలు సత్యం ఆమెని చూసేందుకు అట్టే వీలుండదు. దుకాణంలో జనం. పక్కన తండ్రి. ఎదురుగ్గా స్నేహితులు, నౌఖర్లు ఆమెని దూరంగా పొమ్మని అదిలిస్తుంటారు. కాని ఆమె వచ్చిందీ వెళ్ళిందీ అతనికి బాగా తెలుసు.

★ ★ ★

సత్యంకి ఈ మధ్య ఒంట్లో బాగుండటం లేదు. తలనొప్పి వస్తోంది. అన్నం సయించదు. ఉత్తినే కోపం వస్తుంది. దుకాణం సరిగ్గా కనిపెట్టివుండటం లేదు. పనిమీద శ్రద్ధ తగ్గుతోంది. ఉదయమే కొట్టుకి వెళ్ళి "మిగిలిపోయిన కాయితాలు" చూడటం లేదు. అలా తిరిగి వస్తానని వెళ్ళిపోతాడు, పొద్దు పోయి తిరిగి వస్తాడు. రంగడు చిన్న యజమానికి ఇప్పుడు చాలా సన్నిహితం. ఇద్దరూ ఏవో గుసగుసలాడుకుంటారు. నెలాఖరయినా రంగడి చేతిలో యిప్పుడు రూపాయలు గలగలమంటున్నాయి.

★ ★ ★

'పేరు కాసులు'

'పెళ్ళి కాలేదు'

'అమ్మా నాన్నా లేరు'

'మేనత్త దగ్గిర మకాం'

'ఫ్యాక్టరీలో కూలీ చేస్తోంది'

'అత్త డబ్బుకి ఆశపడేరకం'

'ఈ మధ్య దుకాణం వేపు రావటం లేదు గానీ చెరువు దగ్గర కూచుంటోంది.'

రంగడు యింత సమాచారం సేకరించే సరికి సత్యంకి చాలా ఆనందమయింది. ధైర్యం వచ్చింది. ఉత్సాహం ఉరకలు తీసింది. ఎవరికి రాదు అతని స్థానంలో ! అందుకే సాహసించి ఓ రోజు ఆమెని పలకరించాడు. లోపలికి రమ్మన్నాడు. డ్రింకు తాగమన్నాడు. దగ్గిరుండి దుకాణమంతా చూపించాడు.

ఆ రోజు కాసులు పసుపంచు మందార రంగు చీరె కట్టుకుంది. తల్లో చామంతి పెట్టుకుంది. సత్యం అడిగింది తడవుగా లోపలికి వచ్చేసింది. నగలన్నీ తనివి తీరా ఒకటొకటీ చూసింది. నేలమీద తివాసీ ఒంగి ముట్టుకు చూసింది.

సత్యం స్నేహంగా, చొరవగా ఆమె పక్కన నిలబడ్డాడు. ఎదురు గుండా అద్దంలో ఆమె ప్రతిబింబం కన్నార్పకుండా చూస్తున్నాడు.

"ఇది నీకు నచ్చిందా ?"

ఎఱ్ఱరాళ్ళ నెక్లెసు అది.

తల వూపింది కాసులు, ఇంకా దానివంక చూస్తూనే.

"మెళ్ళో వేసుకు చూడు"

"ఒద్దండయ్యా"

"సిగ్గుపడుతున్నావా ? ఇక్కడెవరూ లేరులే..."

కాసులు తలెత్తి చూసింది.

"ఫరవాలేదు. ఊ, అద్దంలో చూసుకో"

సత్యం ఒంగి అద్దాల తలుపు తోసి నెక్లెసు బైటికి తీశాడు. అలా ఒంగుతున్నప్పుడు అతను కాసులుకి చాలా దగ్గిరగా వెళ్ళవలసి వచ్చింది. ఆమె పక్కకి జరిగిపోలేదు. అతని చేతిలోంచి ధైర్యంగా నెక్లెసు తీసుకుంది. అటూ ఇటూ తిప్పి చూసి మళ్ళీ అతని చేతికిచ్చేసింది.

'ఎంత బాగుందో !'

ఆమె కళ్ళు జిగేలుమన్నాయి.

దూరాన ఫ్యాక్టరీ సైరన్ కూసింది. కాసులు జనప్రవాహంలో కలిసిపోయింది.

★ ★ ★

ఇప్పుడు కాసులు చాలా మారిపోయింది. సత్యంతో మాట్లాడుతుంది. బుగ్గన సొట్ట పడేట్లు అందంగా నవ్వుతుంది. చిలిపిగా చూస్తుంది. ఆమెకెన్నో సందేహాలిప్పుడు. నగలు ఎలా చేస్తారో అడుగుతుంది. ఎంత ఖరీదో కనుక్కుంటుంది. తల రేగిపోకుండా నూనె రాసి అణచి దువ్వుకుంటుంది. చీర శుభ్రంగా ఉతికి కట్టుకుంటుంది. కాళ్ళకి యిప్పుడు మట్టి వుండడం లేదు. తల్లో చామంతి సాయంత్రమైనా వాడటం లేదు. కళ్ళల్లో మునుపటి అమాయకత్వం వుంది గానీ, దిగులు లేదు మనిషిలో. ఎంతో కళ యిప్పుడు కాసులుకి.

★ ★ ★

ఊరికి దూరంగా మామిడి తోట. తోటనంటుకుని చిన్న చిన్న పెంకుటిళ్ళు, గుడిసెలు. మధ్య సన్న సందులు. ఇరుగ్గా, మురికిగా, కుడిపక్కగా, తడికల దడితో ఓ పెంకుటిల్లు. చెక్క తలుపు ఇంటిముందు మట్టి అరుగు. ఓ రోజు మధ్యాహ్నం ఎండ వేళ సత్యం వడివడిగా నడుస్తూ ఆ యింటి వైపు వెళ్ళాడు. భయంగా అటూ ఇటూ చూస్తూ తలుపు తట్టాడు.

కీచుమంటూ తలుపు తెరుచుకుంది. ఒక చిన్నగది. దాన్ని ఆనుకుని అంతకంటే చిన్న వంటిల్లు. ఒకేఒక్క కిటికీ. అదీ చాలా పైకి వుంది. మాసిన బట్టలు దణ్ణెం మీద అడ్డదిడ్డంగా వేళ్ళాడుతున్నాయి. ఓ నులకమంచం, చిన్న పీట, ఓ పక్కగా పిడకలు, గది నానా గందరగోళంగా వుంది.

"రండి అయ్యగారూ ! రండి. ఎంత దయ ! మీలాటి వారు మా గుమ్మాలు తొక్కడం" వంట యింటి గుమ్మంలో గాజులు చప్పుడయింది. కాసులు కుడిచేత్తో కొప్పు సర్దుకుంటూ సూటిగా అతనివంక చూస్తూంది. "అలా కూర్చోండి"

సత్యం పీటమీద కూర్చున్నాడు. జేబులో చేయి పెట్టాడు. ముఖమల్ పెట్టె ధగధగమంది. ఎర్రరాళ్ళ నెక్లెసు తొంగి చూస్తోంది.

"కాసులూ !...."

అతని గొంతు బొంగురు పోయింది. ముచ్చెమటలు పోశాయి.

"ఇంద"

అన్నాడు. తన గొంతు తనకే వినపడనంత హీనస్వరంతో.

కాసులు నేలవంక చూస్తోంది. అతి నిశ్చలంగా వుంది ఆ ముఖం. సత్యానికి ఒక్క క్షణం యుగంలా వుంది. జేబురుమాలుతో ముఖం తుడుచుకున్నాడు. ముగ్ధుడయి ఆమెని చూస్తున్నాడు.

"ఏం కాసులూ అలా ఉన్నావేం ?"

నిద్రలోంచి మేల్కొన్నట్లు ఆమె బరువుగా కళ్ళెత్తింది.

"సంకోచిస్తున్నావా ? ఎందుకూ ? ఇది నీ మెళ్ళో చూడాలని ఎంతగా కాచుకున్నానో తెలుసా ?" ఈ మాటు కాసులు ఉలిక్కి పడ్డట్లు చూసింది అతన్ని. ముఖం పక్కకి తిప్పి, పెదిమలు నొక్కుకుంది. కళ్ళలో కొద్దిగా నీళ్ళు తిరిగాయి. "కాసులూ ! భయపడక ! నన్ను నమ్ము, నిన్ను పువ్వుల్లో పెట్టుకుంటాను. నిన్ను వేరే యింట్లో, అద్దాల మేడలో కంటికి రెప్పలా చూసుకుంటాను. మంచి మంచి చీరలు, ఇలాటి నగలింకా బోలెడన్ని....."

సత్యం చెప్పుకు పోతున్నాడు.

"అయ్యో ! మీరెంత అమాయకులు !"

కాసులు విరక్తితో పెదిమ విరిచింది.

"నా జీవితానికి ఇవాళ ఎంత సుదినమో మీకు తెలీదు. ఏ ఘడియకోసం నేను యిన్నాళ్ళూ తపస్సు చేశానో ఆ ఘడియ వచ్చింది. నా దైవం యివాళే నన్ను కటాక్షించింది. నా వెంకడు ఇవాళే తిరిగివచ్చాడు."

సత్యానికి ఆ మాటలు ఏదో నూతిలోంచి వినపడినట్లు అస్పష్టమయాయి. కాసులు కొంగుతో కళ్ళు తుడుచుకుంటూ యింకా యిలా అంటోంది.

"నా వయసెంత అనుకుంటారు? ఊహూ, చెప్పినా లాభం లేదు. నమ్మరు, మీరే కాదు; చాలా మంది అంతే. నన్ను వెర్రిబాగుల్ది అంటారు కొందరు. ఇలా బ్రతికేకంటే చనిపోమంది అత్త. స్నేహితులు, యిరుగు, పొరుగు నన్ను ఎగతాళి చేస్తారు. కానీ వాళ్ళకేం తెలుసు?

"అమ్మా, నాన్నా నేను ఉయ్యాలలో వుండగానే కరువయారు. మేనత్తదగ్గిర పెరిగాను. చాలా బాగా చూసుకుంది నన్ను. పని పాటలు నేర్పింది. ఆదరణకీ, ప్రేమకీ లోటు వుండేది కాదు.

"నాకు పెళ్ళీడు వచ్చింది. మా మామకి దూరపు చుట్టం వెంకడుకి నన్ను యిచ్చేందుకు నిశ్చయం చేశారు. చుట్టరికం వల్ల అతను మా యింటికి వస్తూ పోతూ వుండే వాడు. ఈ పెళ్ళిమాటలు రాకముందే అతనికీ నాకూ స్నేహమయింది.

"జీవితమంతా మనం ఊహించినట్లు అయితే ? అలా కాదుగా ! ఏ సమస్యలయితే నన్ను విడిపోతాయనుకున్నానో అవి మరింత చిక్కులు పడ్డాయి. వెంకడి కుటుంబంలో అనుకోని సంఘటనలు తలెత్తాయి. అతను మిలిటరీలో చేరాడు. ఈ సంబంధం యిక వదులుకున్నట్లే. అతనింకెక్కడ తిరిగి వస్తాడు, అన్నారు అంతా. నేను నిలువునా మోసపోయానన్నారు. అత్త నాకు వేరే చోట సంబంధం చూస్తానంది.

"కానీ వాళ్ళకి నేనేం తెలుసు ? వెంకడూ, నేనూ గుళ్ళో చెరువు గట్టున చాటుగా కలుసుకునే వాళ్ళం. ఒకరి మనసు ఒకరికి తెలుపుకున్నాం. నన్ను విడిచి ఆ సమయంలో ఎక్కడికి వెళితేనేం మళ్ళీ వస్తానన్నాడు. తనని నమ్మమన్నాడు. చేతిలో చెయ్యి వేయించుకున్నాడు.

"మనిషికి పుట్టుక ఒకసారే. ప్రేమా అంతే. దాన్ని ఎలా విప్పి చెప్పటం ? వెంకడు తిరిగి వస్తాడన్న ఆశ ఒక్కనాడూ నన్ను విడిచి పోలేదు. లేకుంటే ఈనాడు నేనిక్కడ వుండేదాన్నా ?

"కానీ ఇన్నాళ్ళూ ఎలా వున్నాను ?.... దుఃఖమొస్తే నా వెంకడు పక్కన లేడని మరింత దుఃఖమొచ్చేది. వెనువెంటనే అతని దుఃఖం నేను పంచుకుంటున్నానా అన్న ప్రశ్న వచ్చేది. ఆనంద సమయంలో నా కళ్ళకి కట్టేది అతని రూపమే. ఒక మంచి మాట విన్నా, మంచి దృశ్యం చూసినా, నా హృదయానికి ఏవిధంగా ఉల్లాసం కలిగినా, నాకు గుర్తుకొచ్చేది వెంకడే. ఆ అనుభూతి నాకు జీవనాడిగా వుంది యింతకాలంగా.

"నన్ను ఎవరూ అర్థం చేసుకోలేదు. కనికరించలేదు. కనీసం సానుభూతి అయినా చూపలేదు. కానీ నేను కృంగి కృశించి పోలేదు. నాకు నేనే తోడయాను. నన్ను నేనే ఉత్సాహ పరచుకున్నాను. ధైర్యం చెప్పుకున్నాను. మనసుని ఉల్లాస పరచుకున్నాను. చెరువు గట్టున కూర్చుని నీళ్ళకేసి చూస్తుంటే నా మనసుకెంతో బాగుండేది. సాయం కాలాలు కూలీలు పనులు పూర్తిచేసుకుని, చేతులు కలుపుకుని, పాడుకుంటూ వస్తుంటే, ముగ్ధురాలనయేదాన్ని. అలాగే బజారు వీధిలో మీ దుకాణం ముందు నుంచుని ఆ నగలకేసి చూస్తుంటే, ఎంతో ముచ్చటగా వుండేది. ఆ ఘడియలో నా పక్కన వుండేది వెంకడే. నా ఊహలకి రంగులు దిద్దేది అతనే. అంత అందాన్ని చూపించేది అతనే. ఎలా చెప్పను ? ఇంకా ఏమని చెప్పను ?...." కాసులు కళ్ళు ఆక్షణంలో ఎంతో కాంతివంతంగా వున్నాయి. వాటి విలువ ఎంత ???

సత్యం చేతిలో ఎర్రరాళ్ళ నెక్లెసు నలిగింది. అంత కాంతిని భరించలేనట్లు, తూలుతూ అతను వీధిలోకి వచ్చాడు.

దూరాన ఫ్యాక్టరీ సైరన్ మోగింది.

★ ★ ★ ★ ★ ★ ★ ★

COMMENTS